క్లుప్తంగా

మేమంతా సిద్ధం సభను జయప్రదం చేయండి

కంకిపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా గుడివాడలో నిర్వహించనున్న మేమంతా సిద్ధం సభను విజయవంతం చేయాలని పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు పిలుపునిచ్చారు. కంకిపాడులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి మాట్లాడుతూ.. కూటమి కుయుక్తులు పన్నుతూ అధికారపక్షంపై దాడి చేస్తున్నాయన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలన్నా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావాలన్నా జగనన్నకు అండగా నిలవాలన్నారు. సిద్ధం సభను విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: నేడు కానూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు అన్నారు. మహదేవపురం సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. మహదేవపురంకాలనీ, 80 అడుగుల రోడ్డు, పంటకాలువ రోడ్డు, బందరు రోడ్డు, కామయ్య తోపు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

గోసాలలో ఘర్షణ.. కౌంటర్ కేసుల నమోదు

పెనమలూరు: గోసాలలో బంధువుల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీసింది. ఇరు వర్గాల వారు దాడులు చేసుకోవటంతో పోలీసులు శనివారం కౌంటర్ కేసులు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం గోసాల సాయిబాబా కట్టకు చెందిన షేక్.జిలాని, సయ్యద్ మీరా బాషా కుటుంబాల మధ్య గత కొన్నేళ్లుగా వివాదాలతో మాటలు లేవు. కాగా ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. దీంతో షేక్ జిలానీపై సయ్యద్‌మీరా బాషా, ఇస్మాయిల్, సయ్యద్‌బాజి, మస్తాన్‌వలి దాడి చేశారు. అదే విధంగా సయ్యద్‌మీరాబాషాపై షేక్.జిలాని, హుస్సేన్, యాకోబ్‌వలి దాడి చేశారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు పోలీసులు కౌంటర్ కేసులు నమోదు చేశారు.

16న భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

గన్నవరం: శ్రీరామనవమి పండుగ సందర్భంగా గన్నవరం ఆర్టీసీ డిపో నుంచి భద్రాచలానికి ఈ నెల 16వ తేదీన ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం పి.శివాజీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం రాత్రి 10 గంటలకు, 10.30 గంటలకు ఇక్కడి నుంచి సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సులు భద్రాచలానికి బయలుదేరుతాయన్నారు. ప్రత్యేక బస్సుల టికెట్లు ఆన్‌లైన్‌తో పాటు స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

అత్తింటి వారిపై కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం ఉయ్యూరు అబ్దుల్ అల్లాం బజారుకు చెందిన ఉక్కిడి అనూష రెండేళ్ల క్రితం యనమలకుదురుకు చెందిన వెంకటేశ్వరరావును వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. అయితే కొద్ది రోజులు గడిచిన తరువాత భర్త కట్నం చాలలేదని అదనపు కట్నం తీసుకు రమ్మని వేధించసాగాడు. భర్తతో పాటు అత్త వి.రమణమ్మ, ఆడపడుచులు బి.దుర్గ, వి.లక్ష్మిలు వేధించటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై పోలీసులు అత్తింటి వారిపై కేసు నమోదు చేశారు.

ఆర్థిక సహాయం అందజేత



గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామానికి చెందిన దేవరపల్లి మార్తమ్మకు శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆమె తల్లి ఆరోగ్య ఖర్చుల నిమిత్తం సహాయం కోరగా గ్రామ పార్టీ కన్వీనర్ కందిమళ్ల శ్రీనివాసరావు, యూత్ కన్వీనర్ ప్రత్తిపాటి రాజా, సహకార బ్యాంకు చైర్మన్ తుల్లిమిల్లి ఏడుకొండలు సాయం అందించారు. పార్టీ నాయకులు పులపాక అజయ్, క్రీస్తు రాజు, ఏసుబాబు, జగదీష్, పులపాక ప్రభుదాస్, ఏసుపాదం, సామియేలు తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జై భీమ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాపులపాడు మండలం ఆరుగొలనులో విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్స్, బిస్కెట్ ప్యాకెట్లను శనివారం పంపిణీ చేశారు. గ్రామంలోని మూడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లోని 50 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. సంఘం సభ్యులు గోలే రూబెన్, ఇంటి ఫణీంద్ర, పిల్లి రామస్వామి, కె.రాజశేఖర్, కె.సుధీర్, చిన్నం రత్నాకర్, జి.సుందర్‌కుమార్ పాల్గొన్నారు.





జననేతకు అపూర్వ నీరాజనం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర శనివారం రాత్రి గన్నవరం నియోజకవర్గంలోకి ప్రవేశించింది. వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సింహాద్రి చంద్రశేఖరరావు, వంశీమోహన్ రామవరప్పాడు రింగ్ వద్ద సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలికారు. వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. జై జగన్.. జైజై జగన్ నినాదాలతో హోరెత్తించారు. రామవరప్పాడు రింగ్ నుంచి ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి మీదుగా బస్సు యాత్ర కేసరపల్లిలోని బస కేంద్రం వద్దకు చేరింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





ప్రగతి ప్రదాతకు ఘన స్వాగతం

- అభివృద్ధిలో అగ్రభాగాన గన్నవరం
- గత ఐదేళ్లలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి

గన్నవరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సుయాత్ర శనివారం రాత్రి గన్నవరం నియోజకవర్గంలోని రామవరప్పాడు రింగ్ వద్దకు చేరింది. అక్కడ నుంచి ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమనూరు, గూడవల్లి మీదుగా బస్సు యాత్ర కేసరపల్లిలో ముగిసింది. ప్రగతి ప్రదాత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు.

రూ.620 కోట్లతో అభివృద్ధి..

జగనన్న ఐదేళ్ల పాలనలో గన్నవరం నియోజకవర్గంలో సుమారు రూ.620 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. అదే విధంగా రూ.1,448 కోట్లు సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమచేశారు. మరో రూ.419 కోట్లు వెచ్చించి 27 వేల పేద కుటుంబాలకు నివేశన స్థలాలను పంపిణీ చేశారు. నియోజకవర్గానికి ఇంతగా మేలు చేసిన రాజన్న బిడ్డ జగనన్న బస్సు యాత్ర కోసం ప్రజలందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ యాత్రలో వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ పాల్గొనున్నారు.

నియోజకవర్గంలో యాత్ర ఇలా...

కేసరపల్లి ఐటీ పార్కు సమీపంలో ఏర్పాటు చేసిన నైట్ స్టే పాయింట్ నుంచి దుర్గాపురం, గన్నవరం, చిన్నఆవుటపల్లి, పెద్దఆవుటపల్లి, ఆత్కూరు, పొట్టిపాడు, తేలప్రోలు మీదుగా బాపులపాడు మండలంలోకి ప్రవేశిస్తుంది. అనంతరం అంపాపురం, కోడూరుపాడు, వీరవల్లి మీదుగా హనుమాన్‌జంక్షన్ కూడలికి చేరుకుంటారు. అక్కడి నుంచి పెరికీడు, కానుమోలు, ఆరుగొలను మీదుగా పుట్టగుంట వద్ద గుడివాడ నియోజకవర్గంలోకి బస్సుయాత్ర ప్రవేశిస్తుంది.

అభివృద్ధి, సంక్షేమ తోరణం

- ఈ ప్రాంతంలోని కేసరపల్లిలో ఐటీ పార్కు ఏర్పాటు ద్వారా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి బాటలు వేశారు. ఆయన వారసుడిగా సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి మరింత తోడ్పాటునందించారు.



ఎయిర్‌పోర్ట్ కారిడార్‌లో భాగంగా సుందరీకరించిన జాతీయ రహదారి



గన్నవరంలో నిర్మిస్తున్న విత్తన పరిశోధన, శిక్షణా సంస్థ భవనం

- రైతులకు అధిక దిగుబడునిచ్చే నాణ్యమైన, అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలు అందించేందుకు గన్నవరంలో ఏపీ సీడ్స్ కార్పొరేషన్ ప్రాంగణంలోని 8 ఎకరాల్లో రూ.40 కోట్లతో డాక్టర్ వైఎస్సార్ విత్తన పరిశోధన, శిక్షణా సంస్థ ఏర్పాటు చేశారు.
- రూ.22 కోట్లతో రామవరప్పాడు నుంచి గన్నవరంలోని అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 13 కిలోమీటర్లు పొడవునా జాతీయ రహదారిపై గ్రీనరీతో సుందరీకరణ, ఫుట్‌పాత్‌ల ఆధునికీకరణ పనులు చేపట్టారు.
- రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ ఇబ్బందులను నివారించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ రూ.24 కోట్లతో మినీ ఫ్లైఓవర్ నిర్మించింది.
- గన్నవరం వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ద్వారా రూ.12 కోట్లతో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన రెండు భారీ గిడ్డంగుల నిర్మించారు.
- విమానాశ్రయం విస్తరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన 423 నిర్వాసిత కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ఐదు సెంట్ల చొప్పున భూమి కేటాయించారు. సదరు స్థలాలకు లబ్ధిదారులు చెల్లించాల్సిన రూ.3.76 కోట్లు స్టాంప్ డ్యూటీని పూర్తిగా మినహాయింపు కల్పించి, ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి దస్తావేజులు అందజేశారు.
- రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ, ఇతర సమస్యల సత్వర పరిష్కారం ఫలితంగా నేషనల్ హైవే ఆథారిటీ ఆఫ్ ఇండియా భారతమాల ప్రాజెక్ట్ చేపట్టిన చిన్నఆవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు జాతీయ రహదారి బైపాస్ నిర్మాణం 90 శాతం పూర్తయ్యింది.
- నాడు-నేడు మన బడి ద్వారా నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చారు. గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఐదేళ్లలో నియోజకవర్గ రూపురేఖలు మారాయి.

పేదల పక్షపాతి వైఎస్ జగన్..



దేశ చరిత్రలో పేదలకు ఇంతగా మేలు చేసిన ఏకైక సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే. సంక్షేమ పథకాలు ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపారు. కేసరపల్లి గ్రామంలోని వందలాది పేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చారు. ప్రజా సంక్షేమ పాలన అందించిన సీఎం వైఎస్.జగన్‌కు స్వాగతం పలికేందుకు తమ గ్రామ ప్రజలందరం ఎదురు చూస్తున్నాం.

– మేడూరి పుష్పనాథం, రైతు, కేసరపల్లి

పాఠశాలల రూపురేఖలను మార్చారు..



45 ఏళ్ల ఉపాధ్యాయ ప్రస్థానంలో ఎందరో ముఖ్యమంత్రుల పాలన చూశాను. కానీ ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల అభివృద్ధిపై ఇంతటి ప్రత్యేక దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి గతంలో ఎవ్వరూ లేరు. నాడు – నేడు మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయలను మెరుగుపర్చారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు.

మారుబోయిన కోటేశ్వరరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం..



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గన్నవరం రాకకై వేయి కళ్లతో ఎదురుచూస్తున్నాం. ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు ప్రతి గుండెచప్పుడు వేచి ఉంది. జననేత జగన్ పుణ్యమా గాల్ బ్లేడర్ ఆపరేషన్ ఆరోగ్య శ్రీ పథకం కింద చేయించుకుని ఆరోగ్యవంతుడిని అయ్యానన్నారు. అన్ని ప్రభుత్వ పథకాలు నా కుటుంబానికి అందాయి. సీఎం జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

– పామర్తి శ్రీహరి, రైతు, సూరంపల్లి

పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేయండి

పెనమలూరు: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకోవటానికి దరఖాస్తు చేయాలని పెనమలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డి.రాజు తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఉండే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవటానికి దరఖాస్తు (ఫారం – 12)ను ఈ నెల 15వ తేదీలోగా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు.

వలంటీర్ల రాజీనామా

గన్నవరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా మండలంలోని సూరంపల్లి-1, 2 గ్రామసచివాలయాలకు చెందిన 11 మంది వలంటీర్లు శనివారం స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. ఈ మేరకు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అధికారులకు వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. కూటమి కుట్రలను తిప్పికొట్టి రెండో సారి సీఎంగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా డాక్టర్ వంశీమోహన్‌ను గెలిపించుకునేందుకు శక్తివంఛన లేకుండా కృషి చేస్తామన్నారు.

జెడ్పీ హైస్కూల్ అభివృద్ధికి పూర్వ విద్యార్థి సాయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ఏలూరురోడ్డులోని అప్పనవీడు జెడ్పీ హైస్కూల్ అభివృద్ధికి పూర్వ విద్యార్థి రూ.50 వేలు అందజేశారు. బొమ్ములూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కంచి వెంకటేశ్వరరావు ఈ మొత్తాన్ని పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, హెచ్‌ఎం తోట పుష్పవతికి శనివారం అందజేశారు. బాల్యంలో విద్యాబుద్ధులు నేర్పించిన పాఠశాల రుణం తీర్చుకునేందుకు సాయం అందించినట్లు కంచి వెంకటేశ్వరరావు చెప్పారు. రన్నింగ్ ట్రాక్ అభివృద్ధికి ఈ విరాళాన్ని వినియోగిస్తామన్నారు.తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ చింతా రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గన్నవరం చేరుకున్న ఈవీఎంలు, వీవీప్యాట్స్



ఈవీఎంలను పరిశీలిస్తున్న ఆర్వో గీతాంజలి శర్మ

గన్నవరం: కట్టుదిట్టమైన భద్రత మధ్య గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన శనివారం స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకున్నాయి. ఏపీఎస్ ఆర్టీసీకి చెందిన రెండు కార్గో బస్సుల్లో 37 పెట్టెలో తీసుకువచ్చిన 267 చొప్పున బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, 297 వీవీ ప్యాట్స్‌లను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. తొలుత నియోకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వాహనాల సీల్ ఓపెన్ చేసి ఈవీఎంలను బయటకు తీశారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మొదటి రౌండ్ ర్యాండమైజేషన్ ప్రక్రియ అనంతరం నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలు, వీవీపీఏటీలు మచిలీపట్నం నుంచి ఇక్కడికి చేరుకున్నాయన్నారు. వీటిని స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరచడంతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నామినేషన్ల ప్రక్రియ ఉపసంహరణలు పూర్తయిన తర్వాత నియోజకవర్గంలోని 309 పోలింగ్ స్టేషన్‌లకు ఈవీఎంల కేటాయింపుల గురించి రెండో ర్యాండమైజేషన్ ద్వారా రాజకీయ పార్టీల ప్రతినిధులకు నిర్ణీత సమయంలో తెలియజేస్తామని చెప్పారు. ఏఆర్వో పవన్‌కుమార్, ఆర్ఐ ఉదయ్, పలువురు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ రాజ్యం



కలవపాములలో వృద్ధుడిని ఆప్యాయంగా పలకరిస్తున్న మంత్రి జోగి రమేష్

ఉయ్యూరు: సంక్షేమ రాజ్యం కొనసాగాలంటే మళ్లీ జగనన్ననే సీఎం చేసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మండలంలోని కలవపాముల గ్రామంలో శనివారం మంత్రి జోగి రమేష్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీసీ కాలనీ, దూబా మాలపల్లి, జగనన్న కాలనీల్లో విస్తృతంగా పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఎంపీపీ చీలి కల్పన, సర్పంచ్ పానుగుమాటి బాలస్వామి, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మగడ్డ కల్యాణ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు దాసే రవి, నాయకులు గుదే జ్ఞానేష్, లంకపల్లి నాగరాజు, చేబత్తిన నాని, దూబ బాలరాజు, సర్పంచ్ తుమ్మూరు సురేష్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్ర ప్రజల ఉజ్వల భవితవ్యం

కంకిపాడు: జగనన్నతోనే రాష్ట్ర ప్రజల ఉజ్వల భవితవ్యం ముడిపడి ఉందని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ అభ్యర్థి జోగి రమేష్ అన్నారు. మండలంలోని కుందేరు గ్రామంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం శనివారం చేపట్టారు. ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరించారు. స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ బాకీ బాబు, సర్పంచ్ కలకోట రాధిక, ఎంపీటీసీ, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నందిపాటి బిందుమాధవి, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, కమ్మ, సగర, టిడ్కో కార్పొరేషన్ డైరెక్టర్లు రామినేని రమాదేవి, నక్కా శ్రీనివాసరావు, పి.రాఘవరావు, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, ఎంపీటీసీలు తోకల ఉమాదేవి, కోనా కిషోర్, చిట్టూరి ప్రసాద్, సర్పంచ్ బాయిరెడ్డి నాగరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి



కానూరులో ప్రసంగిస్తున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ ప్రసాద్

పెనమలూరు: ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని అసిస్టెంట్ ఎన్నికల అధికారి, తహసీల్దార్ ప్రసాద్ ఆదేశించారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం పెనమలూరు నియోజకవర్గ పీవోలు, ఏపీవోలకు శిక్షణ తరగతి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం ఎన్నికల్లో ఎటువంటి లోపలు లేకుండా నిర్వహించాలన్నారు. ప్రధానంగా పోలింగ్‌కు ఉపయోగించే ఈవీఎంలపై పీవోలకు, ఏపీవోలకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రారంభమయ్యే ముందు ఈవీఎంలను పరిశీలించాలని సూచించారు. తాడిగడప మున్సిపాలిటీ అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో ప్రతి అంశంపై పీవోలు, ఏపీవోలకు క్షుణ్ణంగా అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణపై సందేహాలు ఉంటే వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు. పోలింగ్ ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద తీసుకోవల్సిన సామగ్రి నుంచి పోలింగ్ ముగిసిన తరువాత రిసెప్షన్ సెంటర్ వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శిక్షణలో పీవోలు, ఏపీవోలు అధికారులు పాల్గొన్నారు.

సీఎంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

గన్నవరం: విజయవాడలోని సింగ్‌నగర్‌లో జరుగుతున్న మేమంతా సిద్ధం బస్సు యాత్రలో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై రాయితో దాడి చేయడం అత్యంత దారుణమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. బస్సు యాత్రకు ప్రజల నుంచి వస్తున్న అపూర్వ స్పందన చూసి తట్టుకోలేక టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వ్యక్తులు సీఎం వైఎస్.జగన్‌పై ఈ తరహా దాడులకు పాల్పడ్డారని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి దాడులను ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలని కోరారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి దాడికి పాల్పడిన వ్యక్తులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

టీడీపీ అరాచకశక్తుల కుట్ర

హనుమాన్‌జంక్షన్‌రూరల్: విజయవాడలో 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తెలుగుదేశం పార్టీ అరాచకశక్తులు రాళ్ల రువ్వి దాడి చేయటాన్ని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ తీవ్రంగా ఖండించారు. సీఎం వైఎస్ జగన్‌పై దాడిని జేసీఎస్ మండల కన్వీనర్ ఆవిర్నేని శేషగిరిరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి వెలగపల్లి ప్రదీప్, పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్‌మూర్తి, బాపులపాడు సర్పంచ్ సరిపల్లి కమలాభాయి వేర్వేరు ప్రకటనల్లో తీవ్రంగా ఖండించారు.